క్లుప్తంగా

హెల్మెట్ లేని వాహనదారులకు జరిమానాలు



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ మహేష్

మద్దిపాడు: హెల్మెట్ లేని వాహనదారులకు ఎస్‌ఐ వి. మహేష్ చలానాలు విధించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా మద్దిపాడు అండర్‌పాస్ వద్ద సిబ్బందితో కలిసి గురువారం తనిఖీలు నిర్వహించారు. మోటార్ సైకిళ్లపై ప్రయాణించే వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని పోలీసులు అడిగిన క్రమంలో వాహనానికి సంబంధించిన పత్రాలు చూపాలన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

మత్తు పదార్థాల రవాణాపై దృష్టి పెట్టండి



చీమకుర్తిలోని సమస్యలను వింటున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

చీమకుర్తి: గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. గురువారం చీమకుర్తి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. నేరాల నియంత్రణ, ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాలు వంటి అంశాలపై సమీక్షించారు. చీమకుర్తిలోని ప్రధాన సమస్యలను స్థానిక మీడియా ప్రతినిధులు ఎస్పీ దృష్టికి తీసుకుపోవడంతో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ ఎం.సుబ్బారావు అసెంబ్లీ సమావేశాల నిమిత్తం విధులు నిర్వహణకు వెళ్లటంతో ఎస్సై యూవీ కృష్ణయ్య, స్థానిక పోలీస్ సిబ్బంది ఎస్పీ వెంట ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ



షిరిడీ సాయి ఉన్నత పాఠశాలలలో పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: సాయి మందిర మహారాజ్ వార్షికోత్సవ సందర్భంగా పుష్ప యాగం నిర్వహిస్తున్న పెద్ద అంకబాబు దాతృత్వాన్ని చాటుకున్నారు. షిరిడీ సాయి చారిటబుల్ ట్రస్ట్ తరపున మంగమూరు రోడ్డు మర్రి చెట్టు కాలనీ దగ్గర నిర్వహిస్తున్న శ్రీ షిరిడీ సాయి ఉన్నత పాఠశాలలో 150 మంది విద్యార్థులకు ఒక్కొరికి ఆరు నోట్ పుస్తకాలు గురువారం అందించారు. స్థానిక లాయర్ పేట షిరిడీ సాయిబాబా మందిరంలో నిర్వహిస్తున్న ఉచిత హోమియో వైద్యశాలకు ఫౌండేషన్ ద్వారా లక్ష రూపాయల విలువైన మందులు పంపిణీ చేశారు. అలాగే బిస్కెట్లు, పెన్నులు అందజేశారు.

దుకాణాల తనిఖీ

కంభం: మండలంలోని పలు దుకాణాలను గురువారం మార్కాపురం తూనికలు, కొలతల శాఖ అధికారి షేక్ రియాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తురిమెళ్లలోని ఓ దుకాణంలో తనిఖీ చేసి కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. తూకాలు, కొలతల్లో మోసాలాకు పాల్పడినా, కాలం చెల్లిన వస్తువులు విక్రయించినా, నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సచివాలయం తనిఖీ

కంభం: మండలంలోని తురిమెళ్లలో సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్‌వలి గురువారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, పిల్లలకు అందించాలన్నారు. కేంద్రంలోని రికార్డులు పరిశీలించారు. సచివాలయంలో రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆధార్ క్యాంప్‌ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యదర్శి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు

కంభం: స్థానిక పార్కువీధిలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయుడు రసూల్ బేగ్ మాట్లాడుతూ శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు విద్యార్థులు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వంపై అవగాహన కలిగించేలా విద్యార్థులు వేషధారణలు వేశారన్నారు. సాంస్కృతిక వైవిధ్యం విద్యార్థులకు తెలియజేసినట్లు తెలిపారు. దేశంలోపౌరులంత ఐకమత్యంతో ఉండాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

వైభవోపేతంగా బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణతో శ్రీ నాంచారమ్మ తల్లి



సింహవాహనంపై శ్రీ నాంచారమ్మతల్లికి గ్రామోత్సవం

కొత్తపట్నం: మండల కేంద్రం కొత్తపట్నంలో కొలువై ఉన్న శ్రీ నాంచారమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు మహా వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలు రెండో రోజు చేరుకోవడంతో భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణంలో జనసంద్రంగా మారింది. కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ నుంచి ఆలయం వరకు భక్తులు బారులు తీరారు. నాంచారమ్మ తల్లిని దర్శనం చేసుకోవడానికి క్యూలో నుంచున్నారు. సంతానం కోసం నాంచారమ్మతల్లి ముందు వరపడ్డారు. నాంచారమ్మ తల్లికి రెండో రోజు గ్రామానికి ఉత్తరం వైపు సింహవాహనంపై ఉంచి బ్రహ్మోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి ఈతముక్కల రోడ్డు, బస్టాండ్ సెంటర్ యాదవపాలెం, బీచ్ బజార్, శివాలయం అక్కడ నుంచి నాంచారమ్మతల్లి ఆలయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. నాంచారమ్మ తల్లికి బిందెలతో నీరు పోసి హారతి ఇచ్చారు. రాత్రికి కామదేనువు వాహనంపై శ్రీ నాంచారమ్మతల్లి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామానికి దక్షణం వైపు ఈతముక్కల బజారు, రెడ్డిపాలెం, నాంచారమ్మ కాలనీ వైపు నుంచి ఆలయం వరకు గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు. టెంకాయలు కొట్టి తీర్థప్రసాదం పంపిణీ చేశారు. శంభునిరెడ్డిపాలెం వారిచే పులిబిడ్డలు సాంఘిక నాటకం ప్రదర్శించారు. ఆలయం ప్రాంగణంలో కోలాటం, పాటలు వంటి సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. ఇతర జిల్లాల నుంచి, రాష్ట్రాల నుంచి భక్తులు చేరుకుని నాంచామ్మతల్లిని దర్శనం చేసుకున్నారు.



శ్రీనాంచామ్మతల్లి ముందు సంతానం కోసం వరపడిన మహిళలు

భారతీయ సంస్కృతి తెలియజేయాలి



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తపట్నం: భిన్నత్వంలో ఏకత్వమే ప్రధాన లక్ష్యంగా భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను విద్యార్థులకు అందించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.శ్రీదేవి కోరారు. జాతీయ విద్యా విధానాన్ని దేశవ్యాప్తంగా అచరించడం మొదలై ఇప్పటికీ నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శిక్షాసప్తాహ్ విద్యా వారోత్సవాలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. విద్య, కళలను సాంస్కృతిక విద్యలో అంతర్భాగం చేయాలని జాతీయ విద్యా విధానం 2020 చెబతోందన్నారు. అనంతరం విద్యార్థులతో దేశభక్తి గీతాలు పాడించారు. పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న హరిబాబు, రికార్డ్ అసిస్టెంట్ ఆంజనేయులు కలిసి తల్లికి వందనం అనే లఘు నాటిక ప్రదర్శించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు: నగరంలోని పలు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ జి.వినయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 33 కేవీ విద్యుత్‌లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా నగరంలోని సుజాతనగర్, సమతా నగర్, పీర్లమాన్యం, శ్రీరాం కాలనీ, టీచర్స్ కాలనీ, శ్రీనగర్, ప్రగతి నగర్ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు



మాట్లాడుతున్న పుట్లూరి కొండారెడ్డి

దర్శి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి వరిగిందేమీ లేదని దర్శి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పుట్లూరి కొండారెడ్డి అన్నారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కొండారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని సీఎం చంద్రబాబు అడగక పోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. 10 సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం మోసం చేస్తోందని, కనీసం ఈబడ్జెట్‌లో అయినా ప్రత్యేక హోదా కల్పిస్తారని ఆశించామన్నారు. సీఎం చంద్రబాబు చక్రం తిప్పుతారనుకున్నాం కానీ అక్కడ ఆయన కృషి ఫలించలేదని కొట్టి పారేశారు. బీజేపీ పూర్తిగా మన రాష్ట్ర ఎంపీలపై ఆధార పడినప్పటికీ ప్రత్యేక హోదా ఈ రాష్ట్రానికి ఇవ్వక పోవడం దారుణమన్నారు. విభజన హామీలో ఉన్న విశాఖ రైల్వేజోన్ ప్రస్తావన కూడా తేలేదన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలని, కేంద్రం అంగీకరించని పక్షంలో టీడీపీ మద్దతు ఉపసంహరించుకోవాలని కొండారెడ్డి డిమాండ్ చేశారు. మోదీ తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా చేసిన వాగ్దానంపై స్పందించాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదాను పదేళ్ల పాటు ఇస్తానని ప్రగల్బాలు పలికారని, ఆ హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నా పుల్లారెడ్డి, వల్లెపు శంకర్, దాసరి చెన్న కేశవులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా దాస్



బాధ్యతలు చేపట్టిన దాస్

పెద్దదోర్నాల: పెద్దదోర్నాల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కె.దాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎలక్షన్ సమయంలో పెద్దారవీడు తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన ఆయన్ను జిల్లా అధికారులు పెద్దదోర్నాల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

రేపు మండల పరిషత్ సమావేశం

కొనకనమిట్ల: ఈనెల 27 తేదీన ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ అధ్యక్షతన నిర్వహించన్నట్లు ఎంపీడీఓ సుగుణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు తమ నివేదికలతో సమావేశానికి హాజరుకావాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు, సొసైటీ చైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

మట్టి తోలుతున్న టిప్పర్ల పట్టివేత

మద్దిపాడు: మండలంలోని మల్లవరం సమీపంలోని చెరువు వద్ద నుంచి మట్టి తరలిస్తున్న మూడు ట్రిప్పర్లను జిల్లా విజిలెన్స్ అధికారులు బుధవారం రాత్రి పట్టుకుని సీజ్ చేశారు. ఆ వాహనాలను మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మట్టి తోలుతున్న ట్రిప్పర్లు వారం రోజులుగా రాత్రిళ్లు మట్టి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో వాహనాలను సీజ్ చేశారు. వాహనాల యజమానులకు పెనాల్టీ వేసిన తరువాత చలాన్లు తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు వస్తే వాహనాలను రిలీజ్ చేస్తామని చెప్పారు.

ఒంగోలు డెయిరీని పునఃప్రారంభించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

ఒంగోలు టౌన్: ఆసియా ఖండంలోనే అతిపెద్ద రెండో పాల కేంద్రమైన ఒంగోలు డెయిరీని పునఃప్రారంభించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఒంగోలు డెయిరీని పునఃప్రారంభించాలని కోరుతూ సీపీఐ అధ్వర్యంలో స్థానిక మల్లయ్య లింగం భవనంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అధ్యక్షత వహించారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ ఒంగోలు డెయిరీ పునఃప్రారంభం కోసం అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు రాయబారానికి సన్నమద్ధమవుతున్నట్లు తెలిపారు. ఒంగోలు డెయిరీని పునఃప్రారంభించి సహకార రంగంలోనే కొనసాగించాలని కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య కోరారు. సహకారం రంగంలో ఉంటే ఏకపక్ష నిర్ణయాలు జరగవన్నారు. డెయిరీ ఆస్తుల పరిరక్షణ బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ కోరారు. కార్యక్రమంలో డెయిరీ పూర్వ అధ్యక్షుడు రామారావు, సంయుక్త కిసాన్ మోర్చా అధ్యక్షుడు చుండూరి రంగారావు, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డీవీఎన్ స్వామి, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఎస్.లలితకుమారి, పీవీఆర్ చౌదరి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను బలోపేతం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

దర్శి: విద్యారంగంలో మార్పులను సరిదిద్ది విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు డి.వెంకటరెడ్డి, టి.రాజశేఖర్‌ల ఆధ్వర్యంలో మండల విద్యాశాఖాధికారి బి.రమాదేవి, డీటీ రవిశంకర్‌కు వినతిపత్రం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మీనిగ శ్రీను, పి.ఖాశీ మాట్లాడుతూ జీఓ నంబర్ 117 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేసిన విద్యారంగ సంస్కరణలు ఫలితంగా రాష్ట్ర విద్యావ్యవస్థ అస్థవ్యస్థంగా మారి పోయిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులు విశ్వాసం సడలి పోతుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమై పోతున్నాయని, పరిస్థితులు వికటించక ముందే ప్రభుత్వం మేల్కోవాలని సూచించారు. సహాధ్యక్షుడు అట్లూరి రామారావు, కోశాధికారి కె.రామారావు, జిల్లా కౌన్సిలర్ టి.చెంచయ్య, గౌరవ అధ్యక్షుడు యల్లమందారెడ్డి, కార్యదర్శులు ఇట్లా వెంకటేశ్వర్లు, సీహెచ్‌వీ ఆంజనేయులు, దుగ్గినేని వెంకటేశ్వర్లు, రామిరెడ్డి, రోశయ్య పాల్గొన్నారు.

సిబ్బందిపై కార్యదర్శి వేధింపులు ఆపాలి

మద్దిపాడు: స్థానిక సచివాలయ సిబ్బందికి వేతనాలు చెల్లించకుండా కార్యదర్శి ఇబ్బందులకు గురి చేస్తున్నారని సచివాలయ సిబ్బంది ఎంపీడీఓకు గురువారం ఫిర్యాదు చేశారు. సచివాలయ సిబ్బందిని తన పని వారిలా చూస్తూ.. అసభ్య పదజాలం వాడుతూ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని వాపోయారు. ఇంటి పన్నులకు సంబంధించిన డిమాండ్ నోటీసులు తెస్తేనే జీతాలు పెడతానని మాట్లాడుతున్నారని తెలిపారు. లేదంటే సంజాయిషీ నోటీసులు ఇస్తానంటూ పదే పదే మానసికంగా వేధిస్తున్నారని చెప్పారు. కార్యదర్శిని పిలిపించి మాట్లాడుతానని ఎంపీడీఓ హామీ ఇచ్చారు.

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై

కొనకనమిట్ల: గ్రామల్లో ఎవరైనా అల్లర్లు సృష్టించి, గొడవలకు కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మాధవరావు హెచ్చరించారు. గురువారం నాగరాజుకుంట, మునగపాడు గ్రామాల ప్రజలకు శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన చట్టాలు, న్యాయపరమైన అంశాలను వివరించారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు తావులేకుండా సమన్వయం పాటించి ప్రశాంత వాతావరణంలో జీవించాలని సూచించారు. అనంతరం కొనకనమిట్ల వద్ద జాతీయ రహదారిపై పలు వాహనాలను ఎస్సై తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీజేపీ పెద్దలకు కృతజ్ఞతలు



మాట్లాడుతున్న బీజేపీ అధికార ప్రతినిధి లంకా దినకర్, పార్టీ అధ్యక్షుడు శివారెడ్డి

ఒంగోలు సెంట్రల్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రప్రదేశ్, వికసిత్ ప్రకాశం లక్ష్యంగా బడ్జెట్ ఉందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్ అన్నారు. ఒంగోలు సరోవర్ హోటల్‌లో గురువారం జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి బొద్దిలూరు ఆంజనేయులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా పాల్గొన్న రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్, జిల్లా పార్టీ అధ్యక్షుడు పీవీ శివారెడ్డి పాల్గొన్నారు. లంకా దినకర్ మాట్లాడుతూ బడ్జెట్‌లో జిల్లాకు మంచి ప్రాధాన్యత ఇచ్చిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి, ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్‌కు, కూటమి సీఎంకు, డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు చెప్పారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు పీవీ శివా రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జిల్లాకు వచ్చిన ప్రతి కేంద్ర మంత్రిని కలిసి జిల్లా పరిస్థితిని వివరించి ఆదుకోవాలని కోరిన విషయాలను గుర్తు చేశారు. ఆయా అంశాలపై వాస్తవ పరిస్థితికి తీసుకువచ్చిన పీఎం, సీఎంకు ధన్యవాదాలు చెప్పారు. జిల్లా అధికార ప్రతినిధి బొద్దిలూరు ఆంజనేయులు మాట్లాడుతూ బడ్జెట్‌లో నిరుద్యోగ యువతకు మేలు చేసే విధంగా ఉందని అన్నారు. పాడి, పౌల్ట్రీ పరిశ్రమలకు 50 శాతం సబ్సిడీ ఇవ్వడం స్వయం ఉపాధికి మంచి ప్రోత్సాహం ఇచ్చినట్లయిందన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్యాణ్ చక్రవర్తి, బాపట్ల జిల్లా పార్టీ అధ్యక్షుడు పి.క్రిష్టా రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి రవిశంకర్ పాల్గొన్నారు.

మహిళలకు పెద్ద పీట వేయడం హర్షణీయం



కృతజ్ఞతలు తెలుపుతున్న మహిళా మోర్చా బాధ్యులు

ఒంగోలు సెంట్రల్: కేంద్ర బడ్జెట్‌లో మహిళలకు పెద్ద పీట వేస్తూ నిర్ణయం తీసుకోవటం హర్షణీయమని జిల్లా బీజేపీ మహిళా మోర్చ ఇన్‌చార్జి తీగల సత్యవతి అన్నారు. పార్టీ పిలుపు మేరకు గురువారం మహిళా మోర్చ సమావేశం ఏర్పాటు చేసి బడ్జెట్ తీర్పుపై ధన్యవాదాలు తెలిపారు. అమరావతికి నిధుల కేటాయింపుతో పాటు డ్రోన్ దీదీ యోజన పథకంలో మహిళలకు కేటాయించి నెలకు రూ. 15వేల రూపాయలు ఇవ్వడం, మహిళలు, బాలికలను దృష్టిలో ఉంచుకుని మూడు లక్షల కోట్లు కేటాయించటం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. డ్వాక్రా రుణాలు ఒకో మహిళలకు లక్ష వరకు ఉండే దానికి ఐదు లక్షల వరకు పరిమితి పెంచటం, అవాస్ యోజన ఇళ్లు, ఉజ్వల యోజన కింద గ్యాస్ కనెక్షన్, రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు ముద్ర లోన్లు అందులో మహిళలకు 30 శాతం ఇవ్వడం గురించి చెప్పారు. ఇన్ని వరాలు అందించిన పీఎం నరేంద్రమోదీ, ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మహిళా మోర్చ కార్యవర్గ సభ్యులు ధనిశెట్టి పావని, ఇందుర్తి పద్మావతి, ధనిశెట్టి సుబ్బరావమ్మ, వాకాటి శివ పార్వతి, నక్క రమాదేవి, కరువాది కుమారి, వాకాటి అంకమ్మ, లక్ష్మి, అంజమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయ స్వామి



అనంత కోదండరామ స్వామి మందిరంలో హనుమాన్ చాలీసా పారాయణం

ఒంగోలు మెట్రో: క్రోధి నామ సంవత్సరం ఆషాఢ మాసం గురువారం ఆంజనేయ స్వామి జన్మ నక్షత్రం పూర్వాభాద్ర పురస్కరించుకొని నగరంలోని ఆంజనేయ స్వామి దేవస్థానాల్లో గురువారం అభిషేకాలు అర్చనలు ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. స్థానిక కేశవ స్వామి పేటలోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో, లాయర్ పేట చిట్టి ఆంజనేయ స్వామి మందిరం, భాగ్యనగర్ అభయాంజనేయ స్వామి దేవస్థానం సహా పలు చోట్ల పూజలు నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి తీర్థ ప్రసాదాలను సేకరించి ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు.

అపరిమిత వినియోగాన్ని అరికట్టాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



పీజో మీటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

పుల్లలచెరువు: పరిమితికి మించి భూగర్భ జలవనరుల వినియోగాన్ని అరికట్టాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా ఆదేశించారు. గురువారం మండలంలోని ముటుకుల జెడ్పీ పాఠశాల, కవలకుంట్లలో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పీజో మీటర్లను ఆమె పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలనీటి మట్టం వివరాలను వీటి ద్వారా తెలుసుకునే విధానాన్ని అధికారులు ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో అధిక భూగర్భ నీటి వినియోగ గ్రామాలు 57 ఉన్నాయని వారు చెప్పగా పరిమితికి మించి భూగర్భ జల వినియోగం జరగకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భూగర్భ నీటి మట్టం పెరిగేలా చూడాల్సి ఉందని, ఈ విషయంలో డ్వామా ఆధ్వర్యంలో చేపట్టే నీటి సంరక్షణ పథకాలపై మరింత దృష్టి సారించి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉందని చెప్పారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవడంపై ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట జిల్లా భూగర్భవనరుల శాఖ అధికారి విద్యాసాగర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలి

పెద్దారవీడు: విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని ఏఓ కె. బుజ్జిబాయి అన్నారు. మండల పరిధిలో హనుమాన్ జంక్షన్ కుంటలో గురువారం ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అమ్మిన, రైతులు కొనుగోలు చేసిన వాటిని బిల్లు కచ్చితంగా ఇవ్వాలని, అలా బిల్లు ఇవ్వని పక్షంలో దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బయట మార్కెట్లో నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే రైతులు వెంటనే వ్యవసాయాధికారులకు తెలియజేయాలని సూచించారు. దుకాణాల్లో రిజిస్టర్లు పరిశీలించారు. దుకాణాల్లో విత్తనాలు శాంపిల్స్ సేకరించారు.